

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంగారెడ్డి, మెదక్ పట్టణాలతో పాటు ఆయా జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఆలయాలకు భక్తులు బారులుతీరారు. ఆలయాల్లో ఉన్న పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోషాలు తొలగించి చల్లంగా చూడాలని మహిళలు పాలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కుకున్నారు. అనంతరం మహిళలు పరస్పరం కుంకుమ, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంటికి వెళ్లే దారిపొడవునా ప్యాలాలు చల్లుకుంటూ వెళ్లారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయంలోని పుట్టలో మహిళలు ఇలా పుట్టలో పాలు పోయడానికి తరలివచ్చారు.

-సంగారెడ్డి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి)





కలెక్టర్.. యోగా టీచర్




సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య యోగా టీచర్‌గా మారి విద్యార్థులతో ఆసనాలు చేయించారు. హత్నూర కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సోమవారం రాత్రి బస చేసిన కలెక్టర్, మంగళవారం ఉదయం 5:30 గంటలకు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఆరోగ్యంతో పాటు విద్యార్థులకు ఏకాగ్రత పెంపొందించడానికి యోగా దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

-హత్నూర, జూలై 29 (ఆంధ్రజ్యోతి)

జిన్నారం.. ఇక మున్సిపాలిటీ

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

20 వార్డులు, 17,956 జనాభా, ఓటర్లు 12,710



జిన్నారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మున్సిపాలిటీగా మారింది. ప్రభుత్వంగెజిట్ విడుదల చేయడంతో అధికారికంగా పుర పాలన ప్రారంభమైంది. జంగంపేట, మంగంపేట, ఊట్ల, సోలక్‌పల్లి, అండూరు, రాళ్లకత్వ, శివానగర్, కొడకంచి, నల్తూరు జీపీలు కొత్త పుర పాలికిలో విలీనం కానున్నాయి. మున్సిపాలిటీలో 20 వార్డులు, 17,956 మంది జనాభా, 12,710 ఓటర్లు ఉన్నారు.

ముగిసిన పంచాయతీరాజ్ పాలన

మండల వ్యవస్థ ఏర్పాటు నుంచి ఉమ్మడి జిన్నారం మండలంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ వ్యవస్థ కొనసాగింది. ఐదేళ్ల క్రితం గుమ్మడిదల కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. గతంలోనే బొల్లారం మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. ఆర్నెళ్ల క్రితం ఐదు గ్రామాలతో గడ్డపోతారం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. మిగిలిన 9 పంచాయతీలతో జిన్నారం మున్సిపాలిటీ ఏర్పడటంతో పంచాయతీరాజ్ వ్యవస్థ మగిసింది. జిన్నారం, గడ్డపోతారం, బొల్లారం కేంద్రాలుగా మున్సిపాలిటీ వ్యవస్థ అమలులోకి వచ్చింది.

పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు

సంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సంగారెడ్డి జిల్లాలోని 44 పాఠశాలలకు రూ.20,62,500 నిధులు మంజూరు చేసింది. అదే విధంగా యూత్ అండ్ ఏకో క్లబ్‌ల ఏర్పాటుకు రూ.4,20,000, అలాగే పాఠశాలకు రూ.10 వేల చొప్పున 42 పాఠశాలలకుగాను మరో రూ.4,20,000 నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది మొత్తం రూ.47,75,302 నిధులు మంజూరయ్యాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పట్టాలిచ్చినా పాసుబుక్కులు రాలే


555 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదం

మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య

అటవీ భూములంటూ కొత్త వివాదం

7

తల జర భద్రం



శిరస్త్రాణం.. కాపాడు ప్రాణం

జహీరాబాద్ మండలం చిన్నహైదరాబాద్ శివారులో ఈ నెల 27న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజయ్య(39) అనే వ్యక్తి మృతి చెందాడు. గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన అంజయ్య పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో బైక్ పడటంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు దక్కే అవకాశం ఉండేది.

జిన్నారం మండలం గడ్డపోతారం సమీపంలో ఈ నెల 18న బైక్‌పై వెళ్తున్న మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన శివరాములు(39) ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వారం అనంతరం మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చుకున్న మరో వ్యక్తి నాగేశ్వర్‌రావుకు గాయాలయ్యాయి. హెల్మెట్ పెట్టుకొనివుంటే గాయాలు తగిలినా ప్రాణాలు దక్కేవి.

వేగం మోజు.. మద్యం మత్తు..

ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు

హెల్మెట్ ధరించక.. పోతున్న ప్రాణాలు

పోలీసులు హెచ్చరిస్తున్నా మారని తీరు

ఆసక్తి చూపని యువత

ఆధునిక జీవనశైలి వేగం పుంజుకుంది. వాహనాలు నిత్యావసరంగా మారాయి. కానీ, ఈ వేగమే చాలాసార్లు విషాదానికి కారణమవుతోంది. రహదారి భద్రతా నిబంధనలను పాటించడంలో ప్రజలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు భద్రతా నియమాలను విస్మరించడం, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవిస్తున్న ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు జరిపిన పరిశీలనలో హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని స్పష్టమవుతోంది.

సంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	2022	2023	2024	2025 (జూన్ వరకు)
ప్రమాదాలు	789	827	852	401
క్షతగాత్రులు	754	781	913	486
మృతులు	466	432	384	196

సంగారెడ్డి జిల్లాలో వాహన తనిఖీలు, జరిమానాలు

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	2,89,244	12,11,68,987
2023	2,44,593	9,59,53,273
2024	1,94,888	7,78,47,962

సంగారెడ్డి క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో మరణాలు అధిక శాతం ద్విచక్ర వాహనాల వల్లనే సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాద సమయాల్లో తీవ్ర గాయాలపాలై మరణిస్తున్నారని పోలీసుల పరిశీలనలో తేలింది. హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి బయటపడినవారు కూడా ఉన్నారని అధికారులు చెబుతున్నారు.

యువత అనాసక్తి

హెల్మెట్ ధరించడానికి యువత ఆసక్తి చూపడం లేదు. తమ తల వెంట్రుకలు చెదిరిపోతాయని, అందంగా కనిపించబోమని భావించి హెల్మెట్ పెట్టుకోవడం లేదని తెలుస్తోంది. పోలీసులు ఎన్నిసార్లు కౌన్సెలింగ్‌లు ఇచ్చి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా యువతలో మార్పు రావడం లేదు. ద్విచక్ర వాహనం నడిపే వారే కాకుండా వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలని నిబంధనలు ఉన్నప్పటికీ, 90 శాతం మంది హెల్మెట్ లేకుండానే వాహనాలు నడుపుతున్నారు. రహదారి ప్రమాదాల్లో అధిక మరణాలకు హెల్మెట్ ధరించకపోవడమే కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. అనేకమంది రాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందని పోలీసులు పదే పదే అవగాహనా కార్యక్రమాల్లో వివరిస్తున్నా చోదకుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదాలకు ముఖ్య కారణమవుతోంది. మద్యం మత్తులో వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలకు గుర్తై, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారు. వేగం మోజూలో యువత తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. మద్యం సేవించి ర్యాష్‌గా వాహనాలు నడిపి ప్రమాదానికి కారణమైతే కుటుంబ సభ్యుల భవిష్యత్తు అంధకారమవుతుందని

మిగతా 8వ పేజీలో

క్విక్ యాక్షన్.. విజిబుల్ పోలీసింగ్

దర్యాప్తులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి

డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలి

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

జోగిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులందరూ విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. జోగిపేట, వట్‌పల్లి పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జోగిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదునూ నమోదు చేసి, ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని పక్కాగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను ఎప్పకప్పుడు అవగాహన కల్పించాలన్నారు. డయల్ 100కు వచ్చే ప్రతీ ఫోన్ కాల్‌కు తక్షణమే స్పందించాలని, దీంతో నేర తీవ్రతను తగ్గించవచ్చన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది విధిగా పనిచేసే చోటే నివాసముండాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాత అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రజలు, సంస్థలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆయన వెంట జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్‌లు పాండుగౌడ్, లవకుమార్ ఉన్నారు.

కేటీఆర్.. వక్రబుద్ధి మానుకో

బీఆర్ఎస్, బీజేపీలు రెండూ దొంగ పార్టీలే

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీతో కుమ్మకైన బీఆర్ఎస్‌కు గుండు సున్న

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై దుష్ప్రచారం మానుకోవాలి

పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చేగుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వక్రబుద్ధి మానుకోవాలని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండకు వెళ్తున్న క్రమంలో మంగళవారం ఆమె మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తిశివనూర్ శివారులో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ దొంగ పార్టీలేనని, మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టాయని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాకుండా గుండు సున్నా మిగిలిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అమ్ముడుపోయి ఒక్క సీటు కూడా సాధించలేదన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో వచ్చిన ఓటింగ్ శాతాన్ని ఎంపీ ఎన్నికల్లో ఎందుకు చూపించలేకపోయారని ప్రశ్నించారు. సీఎం రమేష్, కేటీఆర్ మాట్లాడిన విషయాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తామని చెప్పినా ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్‌కు ఆమె సవాల్ విసిరారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడతారనేది సీఎం రమేష్ మాటల్లోనే చూశామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అబద్ధాల మీద ఆధారపడి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా అభివృద్ధికి సహకరించాలని కానీ.. అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వర్షాలు లేవని, వరదలు వచ్చాయని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా నిజం తప్పకుండా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం పోస్టాఫీస్ వద్ద బారులు



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెన్షన్ తీసుకోవడం కోసం పోస్టాఫీస్ వద్ద పెన్షన్‌దారులు బారులు తీరారు. గతంలో వేలిముద్రలు వేసి పెన్షన్ తీసుకునేవారు. వేలిముద్రలు స్కాన్ కాకపోతే గ్రామపంచాయతీ కార్యదర్శి వద్ద నమోదు చేసుకుని నెలాఖరులో డబ్బు తీసుకునేవారు. ఇటీవల వేలిముద్రలు రానీ పెన్షన్ దారులకు పెన్షన్ ముఖచిత్రం స్కానింగ్ తప్పనిసరి చేయడంతో వేలిముద్రలు నమోదు కాని వారు పోస్టాఫీస్‌ల వద్ద బారులుదీరుతున్నారు. మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రంలో మంగళవారం పెన్షన్ కోసం వచ్చినవారు పోస్టాఫీస్ వద్ద ఇలా బారులు తీరారు.

-చేగుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి)

పరిహారం చెల్లింపులో చేతివాటం

భూమి లేనివారికి కోట్లలో చెల్లింపులు

ఫైవ్ మెంబర్ కమిటీ తీరుపై అనుమానాలు

ఇష్టానుసారంగా రికార్డుల్లో పేర్ల నమోదు

న్యాయం చేయాలంటూ తాహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన భూ బాధితులు



గుమ్మడిదల తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గుమ్మడిదల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలంలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకు పరిహారం చెల్లింపుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని 109 సర్వే నెంబర్ల పరిధిలో సుమారు 150 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు కోసం స్వాధీనం చేసుకుంది. ఈ భూమికి ఎకరాకు రూ. 29.50 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. సర్టిఫికెట్ కలిగిన అసలైన యజమానులకు కాకుండా, పట్టాలు లేని వ్యక్తులకు పరిహారం చెల్లించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు మంగళవారం గుమ్మడిదలలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని, నిజమైన యజమానులమైన తమకే పరిహారం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వే ప్రక్రియ మొదలైనప్పటి నుంచి రికార్డుల్లో అనేక మార్పులు చేశారని, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఫైవ్ మెంబర్ కమిటీలోని సభ్యులు పాత పత్రాలను ఆధారంగా చూపుతూ కొందరి పేర్లు బలవంతంగా చేర్చినట్లు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండా చెల్లింపులు జరిపారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్

మిగతా 8వ పేజీలో



తపాలా.. నిర్లక్ష్యమేలా..!

- జోగిపేటలో పెచ్చులూడుతున్న భవనం
- 90 ఏళ్ల నాటి భవనంలో కార్యాలయం

జోగిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పోస్టాఫీసులపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ పని చేస్తున్నారు. జోగిపేట పట్టణంలోని పురాతన పోస్టల్ భవనం ప్రమాదం అంచుకు చేరుతోంది. సుమారు 90 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం 2013లో పునరుజ్జీవం పొందినప్పటికీ.. నేడు పెచ్చులూడి ప్రమాదకరంగా మారుతున్నది. సుమారు 80 ఏళ్ల పాటు ఈప్రాంత ప్రజలకు సేవలందించిన ఈభవనం..శిథిలమై, పైకప్పు పెచ్చులూడుతూ.. అటు ఉద్యోగులకు, ఇటు ప్రజలకు నిత్యం భయాందోళనలు కలిగిస్తోంది.

జోగిపేట పట్టణంలో నిజాం కాలంలో సుమారు 90 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాన రహదారి (నేటి జాతీయ రహదారి) ని ఆనుకుని సుమారు 650 పైచిలుకు గజాల విశాల ఆవరణలో పోస్టాఫీసు భవనాన్ని నిర్మించి. పోస్టల్ సేవలు ప్రారంభించారు.. 2010లో ఈ భవనం శిథిలావస్థకు చేరుకున్నది. ఈవిషయాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా జోగినాథ్.. అప్పటి రాజ్యసభ సభ్యుడు దేవేందర్ గౌడ్ ద్వారా అప్పటి కేంద్ర చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కరుణా పిళ్లైపై ఒత్తిడి తెచ్చారు. దరిమిలా.. కేంద్ర ప్రాజెక్ట్ యారో పథకం కింద లుక్ అండ్ ఫీల్ విభాగపు నిధుల నుంచి విడుదల చేసిన రూ.5 లక్షల నిధులతో స్థానిక పోస్టాఫీసు భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు జరపడమేగాకుండా పైకప్పును బాగుచేశారు. భవనంలోని మొత్తం ఫ్లోరింగ్‌ను విన్నెల్ ఫ్లోరింగ్ చేశారు.


జోగిపేటలోని పోస్టాఫీసు భవనం, కుర్చీలపై పడిన పైకప్పు పెచ్చులు, పోస్టాఫీస్ భవనంలో పెచ్చులూడిన పైకప్పు

కార్యాలయంలోని ఉద్యోగుల కోసం నూతన ఫర్నీచర్‌ను, టేబుళ్లను సమకూర్చారు. వినియోగదారుల కోసం కూడా ఫర్నీచర్‌ను టేబుళ్లను అమర్చారు. భవనం మొత్తానికి పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో ప్లాస్టరింగ్ చేసి, తెల్లరంగును వేశారు.

పోస్టాఫీసులో లభించే సేవల వివరాలను భవనం వెలుపల స్టాండీ (బోర్డు)గా ఏర్పాటు చేశారు. కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్ బోర్డును, డిజిటల్ డిస్‌ప్లే సిస్టంను ఏర్పాటు చేశారు. ఇక, సేవల్లో భాగంగా విదేశాలలో నివాసముంటున్న ఈ ప్రాంతంవారు తమ కుటుంబాలకు పంపే విదేశీ డబ్బును ఇక్కడ మన కరెన్సీలోకి మార్చుకునే సదుపాయాన్ని (మనీ ట్రాన్స్‌ఫర్) కూడా ప్రారంభించారు. పోస్టల్ బీమా తదితర సదుపాయాలను కల్పించారు. పెచ్చులూడిన భవనంఇంతవరకూ బాగానే ఉన్నా.. ఈపురాతన భవనం.. పెచ్చులూడుతోంది. పైకప్పు పూర్తిగా ధ్వంసమై పెచ్చులూడుతున్నది. ఇటీవల ఈభవనంలోని పైకప్పు ధ్వంసమై పెచ్చులూడి కిందనున్న కుర్చీలు, టేబుళ్ల పడింది. రాత్రి కావడంతో అక్కడ అటు సిబ్బంది కానీ, ఇటు ప్రజలు కానీ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గోడలు సైతం పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరి, పెచ్చులూడుతున్న జోగిపేట పోస్టాఫీసు భవనాన్ని సాధ్యమైనంత తొందరగా పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.







ప్రజల ఆరోగ్యం బాధ్యత వైద్య సిబ్బందిదే..

కొల్చారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోతంశెట్టిపల్లి సబ్ స్టేషన్‌ను మంగళవారం మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య సిబ్బంది దేనని అన్నారు. పోతంశెట్టిపల్లి సబ్ స్టేషన్ ద్వారా నిరంతరాయ విద్యుత్ అందుతుందని తెలిపారు. ముందుగా కుల్చారం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్, ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ , ల్యాబ్, ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీబీపీ, షుగర్, రక్తపోటు తదితర వ్యాధుల నిర్ధారణ కోసం సగటున ప్రతిరోజు ఎన్ని రక్తపరీకలు జరుపుతున్నారు, వాటి ఫలితాలను ఎలా తెలియజేస్తున్నారని ప్రశ్నించారు. రక్త పరీక్షల నిర్వహణ వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ పోతం శెట్టిపల్లి సబ్ స్టేషన్‌ను పరిశీలించి సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా విధానాన్ని సంబంధిత అధికారుల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరాయ విద్యుత్ అందించడానికి పలు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్

ఉద్యమబాట పట్టిన ఉపాధ్యాయులు

సిద్దిపేట కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు అందరు ఒక్కటయ్యారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందించుకుని నిరసన కార్యక్రమాలకు దిగుతున్నారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా జూలై 23, 24న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్‌ల ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండం సమర్పించారు.

డిమాండ్స్ ఇవే

ప్రభుత్వం ఏర్పడి దాదాపు 2 సంవత్సరాలవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీలు అమలు కావటం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి, ఉప విద్యాధికారి పోస్టులు ఖాళీలు ఉన్నాయంటున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని చెబుతున్నారు. పీఆర్సీ నివేదికను వెలువరించి 2023 జూలై నుంచి పీఆర్సీ ప్రకటించలేదంటున్నారు. పెండింగ్ బిల్లులు పెరుకపోయాయని ఆరోపిస్తున్నారు.హెచ్‌ఎం పోస్టులు ప్రకటించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కారించాలి. స్థానిక సంస్థల ఎలక్షన్ల కంటే ముందే సమస్యల సాధనకు ప్రభుత్వం చొరవ చూపాలి. దశలవారీగా ఆందోళన కార్యాక్రమాలు చేపడుతున్నాం. లేదంటే ఉద్యమం మరింత ఉధతం చేస్తాం.

-గాడిపల్లి తిరుపతి రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

విరిగి పడిన భారీ వృక్షం


వృక్షాన్ని తొలగిస్తున్న జేసీబీ

మెదక్ అర్బన్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మెదక్ రహదారిలోని అక్కన్నపేట వద్ద భారీ చెట్టు విరిగి పడింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో అటుగా వెళ్తున్న ఆటో, బైక్ దాని కింద ఇరుక్కు పోయి ప్రాణ ప్రమాదం తప్పింది. భారీ వృక్షం కావడంతో సుమారు రెండు గంటల పాటు ఇరువైపులా వాహనాలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు జేసీబీ సహాయంతో ఆ చెట్టును రోడ్డు పక్కకు తొలగించారు. ఇరుక్కున్న వాహనాలను బయటకు తీసి, ఆటోలో ఉన్న ఓ డ్రైవర్‌ను, బైక్ పై ఉన్న ఇరువురిని రక్షించారు. ఈ ఉదయం తీవ్రంగా గాలులు వీచటంతో చింత చెట్టు విరిగి పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో గ్రామస్థులు ఎవరూ అటుగా వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది.

అత్తను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

మద్దూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మద్దూరు మండలం ఘర్మాముల గ్రామశివారు బంజరలో అత్తను హత్యచేసిన అల్లుడిని, సహకరించిన అతడి సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేశ్‌కు, అతడి భార్యకి మధ్య వివాదాలు తలెత్తాయి. అందుకు అత్త వజ్రమ్మ కారణమని, తనభార్యతో కాపురం చేయనివ్వడం లేదని, ఆమె చెప్పే మాటలతోనే కాపురానికి రావడం లేదని భావించాడు. జక్కుల హరీశ్, అతడి సోదరుడు ఆమెను చంపాలని నిర్ణయించుకున్నారు. దీంతో కమ్మ కత్తి వెంటబెట్టుకుని బంజరకు వెళ్లి అత్తతో మాట్లాడుతున్నట్లు నమ్మించారు. ఈక్రమంలో జక్కుల మహేశ్ కత్తితో వజ్రమ్మ తల నరకాడు. చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ విచారణ చేపట్టి ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మనోహరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటన సోమవారం మండల పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సింగం నాగరాజు కుటుంబ సభ్యులు ఈ నెల 26న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి కూకట్‌పల్లి వెళ్లారు. దీంతో తాళం వేసిన ఇంటిని ఎవరో దుండగులు పగటగొట్టి ఇంట్లో ఉన్న 30 తులాల వెండి దొంగిలించడం జరిగింది, మంగళవారం ఇతరుల సమాచారం మేరకు వచ్చి చూడగా నిజంగానే దొంగిలించారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

162 బాటిళ్ల గోవా మద్యం పట్టివేత

జహీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి తెలంగాణలోని నల్గొండకు అక్రమంగా తరలిస్తున్న 162 బాటిళ్ల గోవా మద్యాన్ని మంగళవారం చిరాగ్‌పల్లి అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టువద్ద పట్టుకున్నామని ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్‌ఖాసీం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దఅడిసెపల్లికి చెందిన జయంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి గోవాకు కారులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భాగంగా మంగళవారం గోవానుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా చిరాగ్‌పల్లి అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీలు చేసున్నారు. సరైన సమాచారం మేరకు జయంతిరెడ్డి కారును ఆపి తనఖీలు చేపట్టారు. దీంతో కారులో వివిధరకాల 162 బాటిళ్ల గోవామద్యం లభించింది. ఈ మద్యంవిలువ సుమారు రూ.1.50లక్షల వరకు ఉంటుంది. గోవామద్యం, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డీటీఎఫ్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్, చెక్‌పోస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మద్యం పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు.

మిషన్ భగీరథలో సమపాళ్లల్లో ఖనిజ లవణాలు

నిజాంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటిలో ఖనిజ లవణాలు సమపాళ్లల్లో ఉంటాయని, నీటిని తాగడంతో లాభాలు తప్ప నష్టాలు ఉండవని జిల్లా ల్యాబ్ ఇన్‌చార్జి శ్యామయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్(కే) తండాలో మిషన్ భగీరథ నీటిపై మంగళవారం పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోకల్ బోరు నీళ్లల్లో ఖనిజ లవణాలు ఎక్కువ మోతాదులో ఉంటాయని అవి మానవ శరీరానికి మంచిది కాదని, మినరల్స్ సమపాళ్లల్లో ఉండే మిషన్ భగీరథ నీటిని తాగాలని సూచించారు. అదేవిధంగా లోకల్ బోర్ నీళ్లు, ఫిల్టర్ నీటిని పీహెచ్ అలాగే బల్బు టెస్ట్ ద్వారా ఐదు రకాల కెమికల్స్ పారామీటర్స్‌తో నీటిని పరీక్ష చేశారు. అనంతరం మిషన్ భగీరథ నీటిపై ఖనిజ లవణాలపై గ్రామస్థులకు వివరించి ప్రజల ఆరోగ్య దృష్ట్యా అందరూ పరిశుభ్రమైన మిషన్ భగీరథ నీళ్లను తాగాలని, మానవ శరీరానికి కావలసిన అన్ని రకాల లవణాలు తగిన మోతాదులో ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏ ఈ బిక్షపతి, మణికంఠ గౌడ్, కార్యదర్శి ప్రేమలత, గ్రిడ్ సూపర్వైజర్ సుధాకర్ రెడ్డి మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు ఉన్నారు .

నక్షాబాటను విడిపించండి

- వడ్డెనగూడ తండా రైతుల ఆందోళన
- భూమిని కాపాడాలని విజ్ఞప్తి

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని వడ్డెనగూడ తండా పరిధిలో గల సర్వే నంబర్ 312 నుంచి 352 సర్వేనంబర్లలో ప్రభుత్వ నక్షబాట గొలుసు కట్టు వెడల్పు తొవ్వబాట ఉంది. ఇన్ని రోజులు రైతులు నక్షాదారిని పొలాలలకు వెళ్లేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల ఆ నక్షాబాటలోని సర్వేనెంబర్ 342 నుంచి 354 వరకు కబ్జా అయిందని రైతులు ఆరోపించారు. పక్కనే ఉన్న కొందరు భూస్వాములు తమ నక్షాబాటకు పెన్సింగ్ వేసి దారిని మూసేసారని తెలిపారు. మంగళవారం రైతులు ఆ నక్షాబాట వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. తమ పొలాలకు దారి లేకుండా చేసిన కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. ఇదే విషయమై మా గ్రామ రైతులంతా కలిసి రెండు సంవత్సరాలుగా కంది మండల తహసీల్దార్ కార్యాలయంలో, సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు తమ సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. అందుకే తమ గ్రామ రైతులందరం కబ్జాకు గురైన బాట దగ్గర కూర్చొని నిరసన తెలుపుతున్నామన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వడ్డెనగూడా తండాలో కబా అయినటువంటి ప్రభుత్వ నక్షా బాటను సర్వే చేసి రైతులకు దారి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.


నక్షాబాట వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆగుతూ.. సాగుతూ..

- ఏళ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణం
- నిధుల కొరతతో పనుల్లో తీవ్ర జాప్యం
- ఇరుకు గదుల్లో సాగుతున్న కార్యకలాపాలు

జహీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిధుల కొరత, అధికారుల, నాయకుల పట్టింపులేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. ఆయా కార్యాలయాలు మాత్రం ఇప్పటికీ ఇరుకైన భవనాల్లో కొనసాగుతుండటంతో అధికారులకు, కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో భవనం సుమారు ఎనిమిదేళ్ల కాలంగా నిర్మాణంలో ఉన్నా పనులు పూర్తి కావడం లేదు. జహీరాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న ఎక్సైజ్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయం, అటవీశాఖలో ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్ వంటి అనేక భవనాల పరిస్థితి ఇది.



బాబుమోహన్‌కాలనీలో నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఎక్సైజ్ కార్యాలయం పనులు

ఎనిమిదేళ్లుగా సాగుతున్న ఎక్సైజ్ కార్యాలయ భవనం పనులు

జహీరాబాద్ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం దశాబ్దాలుగా అద్దె భవనంలో, ఇరుకైన గదుల మధ్య కొనసాగుతోంది. ఈ విషయాన్ని గమనించిన గత పాలకులు, అధికారులు, నాయకుల విన్నపం మేరకు పట్టణంలోని బాబుమోహన్ కాలనీలో 2018లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిదేళ్ల కాలంగా భవన నిర్మాణం పనులు ఆగుతూ సాగుతున్నాయి. ప్రస్తుతం భవనంలో ఫ్లోరింగ్, విద్యుత్, మొదటి అంతస్తు పనులు చేపట్టాల్సి ఉంది. భవన నిర్మాణం పూర్తి కావాలంటే సుమారు మరో రూ.10 లక్షలు అవసరం ఉంది. నిధులు వస్తే పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. అద్దె భవనంలో ఇరుకైన గదుల మధ్య విధుల నిర్వహణ కష్టతరంగా మారిందని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. కార్యాలయ భవనం పనులను త్వరితగతిన పూర్తిచేసి తమకు అప్పగించాలని అధికారులు కోరుతున్నారు.

ఏడీఏ కార్యాలయం మూడేళ్లుగా..

జహీరాబాద్ పట్టణంలో గత మూడేళ్ల క్రితం రూ.40 లక్షల వ్యయంతో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం భవన నిర్మాణం పనులకు అధికారులు, నాయకులు శ్రీకారం చుట్టారు. గత మూడేళ్ల కాలంగా భవన నిర్మాణం పనులు ఆగుతూ సాగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఆ కార్యాలయం ఇరుకైన భవనంలో కొనసాగడం వల్ల అధికారులు, కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రూ.10లక్షలైతే భవనం పనులు పూర్తికానున్నాయని అధికారులు, కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులు గుర్తించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని అధికారులు, రైతులు కోరుతున్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్‌దీ అదే పరిస్థితి..

జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మితమవుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి క్వార్టర్ పనులు గత మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఆ భవన నిర్మాణానికి ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం రూ.36.48 లక్షలను మంజూరు చేసింది. మూడేళ్లుగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తిచేసి కొలిక్కి తెచ్చాడు. ప్రస్తుతం అందులో శానిటేషన్ పనులను చేయించాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ పరంగా రూ.6లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఒకవైపు బిల్లు చెల్లించడం లేదు. మరోవైపు నిర్మించిన భవనాన్ని అధికారులు హ్యాండోవర్ చేసుకోవడం లేదు. దీంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆయా భవన నిర్మాణం పనులను పూర్తిచేయించాలని అధికారులు, ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా రాచన్నపేటలోని వ్యసాయశాఖ కార్యాలయం



పనులు పూర్తికాని ఇండస్ట్రియల్ ఏరియాలోని ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్యాలయం



మక్తాఅల్లూరులో పీఎంఏవై రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మక్తా అల్లూరులో కేంద్ర బృందం పర్యటన

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కంది మండలంలోని మక్తా అల్లూరు గ్రామాన్ని మంగళవారం ఎన్‌ఎల్‌ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు సాదిక్, బీవీ సునంజనారెడ్డిలు గ్రామస్థులతో, కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ కార్మికులు, పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు, లబ్ధి గురించి తెలుసుకున్నారు. అలాగే, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారు చేపడుతున్న కార్యకలాపాలు, రుణాల వినియోగం తదితర అంశాలపై సమాచారం సేకరించారు. గ్రామంలో నూతనంగా వేసిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన రోడ్డును, నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, రోడ్ ఫార్మేషన్, తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ వనరుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన పలు డాక్యుమెంట్స్ గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్, పీఆర్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి, ఎంపీవో మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలి

- కాశీ పీఠం జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య స్వామిజీ



అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న శివాచార్య స్వామిజీ

పుల్కల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడుచుకొని, కీర్తిని సంపాదించుకోవాలని కాశీ పీఠం జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య స్వామిజీ సూచించారు. పవిత్ర శ్రావణ మాసంలో వీరశైవ మత పరంపర పర్యటనలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన చౌటకూర్ లోని మఠం శంకరయ్య స్వామి ఇంటికి వచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సందేశామిచ్చారు. రోజుకో గ్రామాన్ని పర్యటించి వీరశైవ మత పరంపరను ప్రచారం చేస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. గురువులను భక్తి శ్రద్ధలతో పూజించడం అసలైన భారతీయత అని అన్నారు. లింగధారణ సంస్కారం, మంత్రోపదేశం పొంది ధర్మ మార్గాన్ని అనుసరించాలని స్వామిజీ సూచించారు. ఈ సందర్భంగా జగద్గురువుకు ఘనంగా పాదపూజ నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఓంకార సిద్ధ శివాచార్య స్వామిజీ, గురుసిద్ధ మణికంఠ శివాచార్య స్వామిజీ, చీల మల్లన్న, మఠం మల్లేశం, వీరభద్రస్వామి, మఠం జగదీశ్వర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో పారదర్శకతకే ఆర్టీఐ చట్టం

- రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర కమిషనర్లు, కలెక్టర్

మెదక్ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయనతోపాటు కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, మోసిన్‌పర్వీన్, వైష్ణవీభూపాల్ మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. వీరికి కలెక్టర్ రాహుల్ రాజ్ స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ప్రజావాణి హాల్‌లో ఆర్టీఐ అమలు విధివిధానాలపై అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలోని 29 ప్రభుత్వ శాఖల్లో 15 శాఖల్లో ఏలాంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌లోడ్ ఇప్పించండి

- కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రికి వినతి



ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కార్పొరేటీకరణ తరువాత వర్క్‌లోడ్ లేక ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నామని వారు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు నల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఎంఎస్ నాయకులు, ఉద్యోగులు బాలనర్సయ్య, ఈశ్వరయ్య, ప్రభు, రవి, శివకుమార్, కంది శ్రీనివాస్, ప్రదీప్ కుమార్ ఢిల్లీకి తరలివెళ్లారు. మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్‌ను కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. 500 బీఎంపీ-2 యుద్ధ వాహనాలు, నాగ్-2 వెపన్స్ తయారీ ఆర్డర్లు, వర్క్‌లోడ్ పెంచాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సంజయ్ సేథ్‌ను కోరినట్లు ఉద్యోగులు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఈ విషయాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక అందించి ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పినట్లు వారు తెలిపారు.

ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తికి అరుదైన గౌరవం

- ఐఐఎం అధ్యక్షుడిగా నియామకం



కోల్‌కతాలో ఐఐఎం 79వ వార్షికోత్సవంలో ప్రొఫెసర్లతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తికి అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌మెటల్స్ (ఐఐఎం) అధ్యక్షుడిగా ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి నియమితులయ్యారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఐఐఎం 79వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రొఫెసర్ మూర్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుని, నియామక పత్రాన్ని అందజేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ అనేది విద్యా, పరిశ్రమ, పరిశోధనలలో మెటలర్జికల్, మెటీరియల్ ఇంజనీరింగ్ నిపుణులకు ప్రాతినిధ్యం వహించే ఒక ప్రముఖ ప్రొఫెషనల్ సంస్థ. ఐఐఎం దశాబ్దాలుగా భారతదేశ మెటలర్జికల్ తయారీ పర్యావరణ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇంత పెద్ద సంస్థకు మూర్తి అధ్యక్షుడిగా నియమితులవ్వడం పట్ల ఐఐటీ అధ్యాపకబృందం సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. 1992లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రొఫెసర్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన బీఎస్ మూర్తి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. ఈ మధ్యనే కేంద్ర విద్యాశాఖ మూర్తిని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా రెండోసారి నియమించి కొనసాగించగా, 2030 వరకు ఆయన ఇక్కడ డైరెక్టర్‌గా తన సేవలను అందించనున్నారు. ఐఐఎం అధ్యక్షుడిగా ఆయనకు ఇవి అదనపు బాధ్యతలు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీలో రసాభాస

- ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే సునీతారెడ్డి అసహనం



రైతు వేదిక బయటే నిలుచున్న ఎమ్మెల్యే సునీతారెడ్డికి నచ్చజెప్పుతున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

చిలప్‌చెడ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల నినాదాలతో రసాభాసగా మారింది. మంగళవారం మండలం పరిధిలోని చిలప్‌చెడ్ రైతు వేదికలో 93 మంది లబ్ధిదారులకు అధికారులు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ముందుగా వెళ్లి మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా, ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి వారితో వాదించారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేసి 'జై కాంగ్రెస్, జై రేవంత్ రెడ్డి' అంటూ నినాదాలు చేయడంతో, బీఆర్ఎస్ నాయకులు వారికి పోటీగా 'జై కేసీఆర్, జై బీఆర్ఎస్' అంటూ నినాదాలు చేయడంతో అంతా రసాభాసగా మారింది. కలెక్టర్ గారు ఇదంతా పట్టించుకోకుండా వేదికలోకి వెళ్లడం సమంజసంగా లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేస్తూ రైతు వేదిక బయటే ఉండిపోయారు. అనంతరం ఆర్డీవో మహిపాల్ రెడ్డి ఆమెకు నచ్చచెప్పి కార్యక్రమానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల పంపిణీ మొక్కుబడి కార్యక్రమమని ఎద్దేవా చేశారు. మండలంలో కేవలం 93 మందికే రావడం ఏంటని ప్రశ్నించారు. ఇది పార్టీ కార్యక్రమం కాదని, ఓర్పు సహనంతో ఉన్నంత మాత్రాన అసమర్థత అనుకోవద్దని హెచ్చరించారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో కలీముల్లా, అధికారులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

శివ్వంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో చేతివాటం ప్రదర్శించినట్లు విచారణలో తేలడంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లో నుంచి తొలగించిన ఘటన మంగళవారం గోమారంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని గోమారం గ్రామంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ దొంతి రెడ్డి లక్ష్మణ్‌గౌడ్ ఉపాధి పనులు చేయకుండానే చేసినట్లు రికార్డు చేసి డబ్బులు డ్రా చేయడంతో పాటు, సికింద్లాపూర్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి పనుల్లో కూలీల తప్పుడు పేర్లను బిల్లు చేసినట్లు ప్రజా వేదిక సామాజిక తనిఖీలలో వెలుగు చూసింది. విచారణలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో అతడిని సస్పెన్షన్ చేస్తూ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మి తెలిపారు.

పట్టాలిచ్చినా పాసుబుక్కులు రాలే..

- 555 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదం
- మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య
- అటవీ భూములంటూ కొత్త వివాదానికి తెరలేపిన సంబంధిత శాఖ



సాగులో ఉన్న రైతులు

రామాయంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిలా రామాయంపేట మండలం, రాయిలాపూర్ గ్రామంలో ప్రభుత్వ పట్టాలపై కొత్త వివాదం తలెత్తింది. 1995లో 130 మంది లబ్ధిదారులకు 140 ఎకరాల్లో రెవెన్యూ శాఖ పట్టాలు పంపిణీ చేయగా, ప్రస్తుతం ఆ భూములు అటవీ శాఖకు చెందినవని కొత్త వాదన తెరపైకి వచ్చింది. 881 సర్వే నంబర్‌లోని 555.09 ఎకరాల భూమిలో ఈ పట్టాలు ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా రైతులు ఈ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ధరణి పోర్టల్ వచ్చాక ఈ భూములు నమోదు కాకపోవడంతో రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులు అర్హత కోల్పోయారు. గత నెలలో జరిగిన భూభారతి కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



భూ భారతిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

30 ఏళ్లుగా సాగులో ఉన్నాం



గత ప్రభుత్వం మాకు భూమి పట్టా ఇచ్చింది. పొదలు తొలగించి వ్యవసాయానికి అనుకూలంగా చేసుకున్నాం. ఒక బోరు కూడా తవ్వి పంటలు పండిస్తున్నాం. కానీ ప్రస్తుతం ఆ పట్టాలు చెల్లవంటూ అధికారులు చేస్తున్న ప్రచారం తగదు. అది అటవీ భూమి అంటూ కొత్త సమస్యను మా నెత్తిన రుద్దడం సరికాదు. ఇదే జరిగితే పోరు బాట తప్పదు.

- జిన్న రాజయ్య, రైతు

సమస్యకు పరిష్కారం చూపాలి



ఇన్నేళ్లుగా పంటలు పండిస్తూ ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో మా భూములు నమోదు కాలేదు. దీంతో తమ భూములకు రక్షణ లేకుండా పోయింది. పాత పట్టాలు పనికిరావంటూ ప్రచారం చేసి భూములు కాజేయాలని చూస్తుండడం సరికాదు. కాంగ్రెస్ సర్కార్ స్పందించి భూభారతిలోనైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

-చాకలి బాలమల్లు, రైతు

అటవీ భూములుగా రికార్డులున్నాయి

881 సర్వే నంబర్‌లోని 555.09 ఎకరాల భూములు అటవీ శాఖవిగా రికార్డులు చూపుతున్నాయి. ధరణి పోర్టల్‌లో సదరు భూములు నమోదై ఉన్నాయి. కానీ గతంలో పట్టాదారులకు ఇచ్చిన పేర్లు మాత్రం దీనిలో కనిపించడం లేదు. ఈ సమస్యపై ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా తాము మున్ముందు నిర్ణయం తీసుకుంటాం.

- తహసీల్దార్ రజినికుమారి


నాగులపంచమి సందర్భంగా పటాన్‌చెరులో పుట్టలో పాలు పోస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


కల్హేర్ శివారులోని నాగులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు


ఖేడ్ మండలం రుద్రారం వద్ద భూలక్ష్మి నాగదేవత ఆలయం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా నాగులపంచమి


జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రకాలనీలో నాగదేవత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నాగులపంచమి పండుగను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పలు శివాలయాల్లో ఉన్న పుట్టల్లో పాలు పోసి నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమపై ఉన్న నాగదోషాలు తొలగించి చల్లంగా చూడాలని మహిళలు పాలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కుకున్నారు. పూజలు ముగిసిన అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుని కుంకుమ ధారణ చేశారు. ఇంటికి వెళ్లే సమయంలో దారిపొడవునా ప్యాలాలు చల్లుకుంటూ వెళ్లారు.

- న్యూస్ నెట్‌వర్క్


హవేళిఘణపూర్ మండలంలోని భూర్గుపల్లిలో పుట్ట వద్ద నాగదేవతకు పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు


కౌడిపల్లిలోని పోచమ్మ ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


చిన్నశంకరంపేటలో పోచమ్మ ఆలయం వద్ద పుట్టకు పాలు పోస్తున్న భక్తులు


శివ్వంపేటలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

పరిహారం చెల్లింపులో చేతివాటం

(5వ పేజీ తరువాయి)

పరమేశం వివరణ ఇస్తూ ఇరవై సంవత్సరాలుగా సాగు చేస్తున్న, రికార్డులో పహాని తీసుకొన్న వారిని గుర్తించి పరిహారం ఇస్తున్నట్లు తెలిపారు.

అర ఎకరాకే పరిహారం



ఎకర పట్టా భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. కానీ అర ఎకరాకే పరిహారం ఇచ్చారు. మా పక్కనే భూమి ఉన్న వ్యక్తి పేరిట నాలుగు ఎకరాలు ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకున్నారు.

- తుడుం లక్ష్మి, గుమ్మడిదల

రికార్డులో పేరు లేదు



ఎంజాయ్ సర్వేలో మా భూమిని గుర్తించారు. కానీ, తర్వాత రికార్డుల్లో మా పేరు కనిపించడంలేదు. మా అభ్యర్థనల్ని అధికారులు పట్టించుకోవడంలేదు. వంద సార్లు తిరిగినా న్యాయం జరగలేదు.

-డప్పు శ్రీనివాస్, గుమ్మడిదల

తల జర భద్రం..

(5వ పేజీ తరువాయి)

పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నా మార్పు కనిపించడం లేదు. మద్యం సేవించి ర్యాష్‌గా వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు జరిమానాల రూపంలో చర్యలు తీసుకుంటున్నారు.

వాహన చోదకుల్లో మార్పు రావాలి



వాహన చోదకుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ కాపాడుతుంది. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లనే ఎక్కువ మరణాలు సంభవించాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హెల్మెట్ విధిగా ధరించాలని పోలీసు శాఖ తరఫున వాహన తనిఖీలు నిర్వహిస్తూ, కౌన్సిలింగ్ ఇస్తున్నాం. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తున్నాం. కళాశాలల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో కూడా హెల్మెట్ వాడకం వల్ల ప్రయోజనాలను వివరిస్తున్నాం.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

న్యూస్ బాక్స్

లైసెన్స్డ్ సర్వేయర్ల ప్రాక్టికల్ పరీక్షల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం మంగళవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలను అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో థియరీ, ప్లాటింగ్, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. 160 మందికి 127 మంది హాజరయ్యారు. 33 మంది గైర్హాజయ్యారు. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు సహాయ సంచాలకులు ఐనేష్, నాలుగు డివిజన్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

సంగారెడ్డి క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మల్టీజోన్-2 డిప్యూటీ ఐజీ తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో బదిలీ అయి కొత్త స్థానాల్లో చేరిన ముగ్గురు సీఐలు మంగళవారం సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంజక్‌ను కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీడీఎల్ భానూరు సీఐగా విజయకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ సీఐగా కిరణ్‌కుమార్,కంగ్టి సీఐగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఎంఎన్ కెనాల్‌లో పిచ్చి మొక్కలు తొలగించండి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఘనపురం ఆయకట్టు పరీవాహక కాలువలో పిచ్చిమొక్కలను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మహబూబ్ నగర్ కెనాల్ పరీవాహక రైతులు ఈ విషయమై తన దృష్టికి తేవడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పెరిగిన గుర్రపు డెక్క, తుంగను తొలగించి రైతులకు సకాలంలో సాగుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు తెలుసుకోవడానికే 'నమస్తే నర్సాపూర్'

నర్సాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకునేందుకే 'నమస్తే నర్సాపూర్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 3,7,8,15 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

రహదారి పనులు చేపట్టాలి

కల్హేర్/సిర్గాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్ నుంచి నారాయణఖేడ్ వరకు చేపట్టిన డబుల్ లేన్ రహదారి పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే పనులు ప్రారంభించాలని బీఆర్ఎస్ సిర్గాపూర్ అధ్యక్షుడు సంజీవరావ్‌పాటిల్ కోరారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సింహులుకు విన్నవించారు.

వన దుర్గమ్మ సేవలో ఆర్టీఐ కార్యదర్శులు

పాపన్నపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కుచట్టం కార్యదర్శులు మంగళవారం ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్టీఐ కార్యదర్శి రాములు, డిప్యూటీ కార్యదర్శి ప్రమీల, సభ్యులు ఉదయం ఏడుపాయలకు రాగా వారికి సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అంద జేశారు.

'పీఎంశ్రీ'కి తెల్లాపూర్ ఎంపిక కావడం హర్షణీయం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


పీఎంశ్రీ పథకం పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం/పటాన్‌చెరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజక వర్గంలోని తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల పీఎం శ్రీగా ఎంపికకావడం హర్షణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే పీఎంశ్రీకి ఎంపిక కాబడ్డ పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా జిల్లాకు పేరుతీసుకురావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఉన్నతస్థాయిలో విద్యార్థులకు విద్యనందించడం వల్లే ఇది సాధ్యపడిందన్నారు ఈ కార్యక్రమంలో కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధికారి పీపీ రాథోడ్, హెడ్ మాస్టర్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ నాగరాజు, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నియోజకవర్గవ్యాప్తంగా రేషన్‌కార్డులు జారీచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 2,096 మందికి నూతన రేషన్‌కార్డులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి స్వరూప, నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు పట్టణానికి చెందిన నీసాల రాజు అనే వ్యక్తి చేపట్టిన తిరుపతి పాద యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయకుమార్ తదితరులు ఉన్నారు.

వసతి గృహ నిర్మాణం విద్యాభివృద్ధికి దోహదం

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


నాగుపల్లిలో గిరిజన సంక్షేమ వసతిగృహం భూమి పూజలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గిరిజన వసతి గృహ నిర్మాణం విద్యాభివృద్ధికి దోహదమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని నాగులపల్లిలో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న గిరిజన సంక్షేమ వసతి గృహానికి ఢిల్లీలో వర్చువల్‌గా కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ శంకుస్థాపన చేశారు. నాగులపల్లిలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ తదితరులు భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే ఈ నియోజకవర్గంలోని నాగులపల్లిలో వసతిగృహం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు. వసతి గృహానికి నిధులు మంజూరు చేసినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని, మంత్రి, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

నేడు కేజీబీవీ కళాశాల భవనం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నూతన భవనాన్ని ఈ నెల 30న ప్రారంభిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి స్రవంతి మంగళవారం తెలిపారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈనెల 28న 'ఆంధ్రజ్యోతి' దినపత్రిలో 'నిర్మాణానికి ఆరేళ్లు.. మరి ప్రారంభోత్సవానికి..?' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ మహిళా సంఘాలదే

జోగిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : 100 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతీ ఇంటికి పంపిణీ చేసిన మొక్కలను సంరక్షించేలా ఆయా ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించే బాధ్యత మహిళా సంఘాల సభ్యులదేనని అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఏ.రవీందర్ అన్నారు. మంగళవారం ఆయన జోగిపేట పట్టణంలోని 11,12 వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


ఖేడ్‌లో సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/ఫుల్‌కల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో సంజీవన్‌రావుపేటకు చెందిన కొట్టల సత్యనారాయణకు రూ.60 వేలు, పోశెట్టి అంజయ్యకు రూ.45 వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రుబీనాబేగంనజీబ్, మాజీ కౌన్సిలర్ స్వప్నఅభిషేక్ షెట్కార్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామానికి చెందిన బుర్ర సతీష్‌కు మంజూరైన రూ.20 వేల సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రామాగౌడ్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్కల రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ డప్పు శంకర్ పాల్గొన్నారు.

కార్యాలయాలు తరలిపోతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారు?

మెదక్ మున్సిపాలిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని విజయ పాల డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం సంగారెడ్డికి తరలిపోయిందని.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఏం చేస్తున్నారని మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పట్టణంలో 49 ఏళ్లుగా పాడి రైతులకు సేవలందిస్తున్న విజయ పాల ఉత్పత్తి డిప్యూటీ కార్యాలయం సంగారెడ్డికి తరలివెళ్లడంపై కారణం తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో జిల్లా చెందిన ప్రభుత్వ కార్యాలయాలు సిద్దిపేటకు తరలివెళ్లాయంటూ ఆరోపణలు చేసిన స్థానిక ఎమ్మెల్యే రోహిత్ ఇప్పుడేం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి విజయపాల డైరీ కార్యాలయం ఇక్కడే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, భీమరి కిషోర్, ఆర్కె శ్రీనివాస్, వంజరి జయరాజ్, లింగారెడ్డి, జీవన్‌రావు, కిరణ్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలను వివరించాం : డీసీసీ అధ్యక్షుడు

నర్సాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న కార్యక్రమాలను పీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌కు వివరించామని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మీనాక్షి నటరాజన్ నిర్వహించిన సమావేశంలో జిల్లాలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించామన్నారు. త్వరలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ విషయం కూడా ప్రస్తావించినట్లు తెలిపారు.

మెడ్వాన్ సేవలు భేష్ : కలెక్టర్


కలెక్టర్ ప్రావీణ్యకు మెడ్వాన్ అందిస్తున్న సేవలను వివరిస్తున్న డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మెడ్వాన్ సంస్థ అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ప్రశంసించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం సంస్థ విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంస్థ కో ఆర్డినేటర్ స్వప్న, ముజీబ్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

సంగారెడ్డి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డివిజన్‌కు కొత్తగా నియమితులైన సబ్ కలెక్టర్ ఉమాహారతి మంగళవారం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కాగా సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉమాహారతికి కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు తెలిపారు.

పాఠాలు విని.. సూచనలు చేసి..

● జీఎన్‌హెచ్‌ఎస్‌ను తనిఖీ చేసిన డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలను(జీఎన్‌హెచ్ఎస్) సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనను తరగతి గదిలో కూర్చొని ఆయన ప్రత్యక్షంగా విన్నారు. లెసెన్ ప్లాన్స్‌తో పాటు పలు రికార్డులను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఆదేశించారు. రికార్డులు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కులకర్ణి సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై ఆడిట్

సంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో నిధులు వినియోగంపై మంగళవారం సంగారెడ్డిలోని గాంధీ సెంటినరీ పాఠశాలలో ఆడిట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఏటా సమగ్రశిక్షా ద్వారా మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో అక్రమాలు చోటు చేసుకోకుండా ఆడిట్ అధికారులతో తనిఖీలు చేయిస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల నిర్వహణ, క్రీడలు, ఇతర అవసరాలకు ఏటా మంజూరు చేస్తున్న నిధులకు సంబంధించి బ్యాంకు స్టేట్‌మెంట్, వోచర్లు, ఇతరత్ర బిల్లులను పరిశీలించారు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, పుల్కల్, చౌటకూర్, మునిపల్లి, అందోలు, వట్‌పల్లి, హత్నూర, నిజాంపేట మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు హాజరై ఆడిట్ చేయించుకున్నారు. కాగా ఆడిట్ నిర్వహణ తీరును డీఈవో వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు.

ఉపాధిహామీలో అక్రమాలు

● అదనపు డీఆర్డీవో బాలరాజు

మనూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ద్వారా మనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు అదనపు డీఆర్డీవో బాలరాజు తెలిపారు. మనూరు మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఈజీఎస్‌లో రూ.33,350 వేలు, పీఆర్‌లో సీసీరోడ్లు రూ.1,99,424 లక్షలు, మొత్తం రూ.2,32,774 లక్షలు దుర్వినియోగమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులను సక్రమంగా మెయింటనెన్స్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో ఇక్బాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చిరంజీవి, సురేష్, శిరోమణి, సంగమేశ్వర్, నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, సంగీత పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సంగారెడ్డి అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే(సదాశివపేట) బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. వికారాబాద్‌లోని శ్రీసాయి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జేకే ఫెన్నార్ కంపెనీ సహకారంతో పాఠశాలలోని 392 మంది విద్యార్థులకు విజయవంతంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ క్రిష్ణప్రసాద్‌రీతు, సీఎస్ఆర్ ఆక్టివిటీ కోఆర్డినేటర్ రమణ, ఆర్‌సీవో గౌతమ్‌కుమార్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.సంతోషి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు

కోహీర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని ఆత్మ కమిటీ ఛైర్మన్ పట్లోళ్ల రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా మాచిరెడ్డిపల్లి గ్రామంలో పశు సంవర్థక శాఖలో పనిచేసిన వెటర్నరీ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోను కలిసిన 104 ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డా.నాగనిర్మలను 104 ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.నుస్రత్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌వో మీ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షి నటరాజన్ నివాసంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఇందులో పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, పార్లమెంట్ అబ్జర్వర్ శివసేనారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

- సంగారెడ్డి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి)